కేసీఆర్ పాలనలో

# అగ్రగామిగా తెలంగాణ

- దేశానికే దిక్సూచిలా నిలిపారు
- రేవంత్‌రెడ్డి పాలనలో తిరోగమనంలో రాష్ట్రం
- దిగజారుడు మాటలు మాని.. ఇచ్చిన హామీలపై దృష్టి సారించండి
- మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి





మోర్తాడ్, జూన్ 2: 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటంచేసి తెలంగాణ సాధించిన కేసీఆర్ పదేండ్ల పాలనలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా, అన్ని రంగాల్లో దిక్సూచిలా నిలిపారని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేములప్రశాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం బాల్కొండ నియోజకవర్గం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంతోపాటు బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో వేముల పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర, జిల్లా ప్రజలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజాసంఘాలు, మహిళలు, సబ్బండ వర్ణాలు ఒక్కటై నిలిచి 'మా తెలంగాణ మాకు కావాలి' అంటూ ఆనాడు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచారని తెలిపారు. ఎందరో యువకులు తెలంగాణ కోసం ఆత్మబలిదానాలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులు సమైక్య పాలకులకు ఎదురొడ్డి ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తుచేశారు. తెలంగాణ సిద్ధించాక కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను కడుపులో పెట్టుకుని జనరంజక పాలన అందించారన్నారు. రైతుబంధు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబీమా లాంటి పథకాలను మీరు కూడా అమలు చేయండి అంటూ కేంద్రం, ఇతర రాష్ట్రాలకు సూచించే స్థాయికి తెలంగాణను కేసీఆర్ ముందుకు తీసుకెళ్లారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటిని సమపాళ్లలో తీసుకెళ్లారని తెలిపారు. ఏ రాష్ట్రం అయినా అభివృద్ధి చెందింది అనడానికి మూడు కొలమానాలు ముఖ్యమని, అవి తలసరి ఆదా యం, జీఎస్‌డీపీ పెరుగుదల, విద్యుత్ వినియోగం అని చెప్పారు.

### కేసీఆర్‌ది జనరంజక పాలన

కేసీఆర్ జనరంజక పాలనలో చిన్నరాష్ట్రం అయిన తెలంగాణ తలసరి ఆదాయంలో దేశంలో నంబర్‌వన్ రాష్ట్రంగా, జీఎస్‌డీపీ పెరుగుదలలో దేశంలో మూడోస్థానంలో, విద్యుత్‌వినియోగంలో నంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. కేసీఆర్ పదేండ్లపాలనలో తెలంగాణను అద్భుతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దితే, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికాలంలో రాష్ట్రాన్ని దేశంలో తలసరి ఆదాయంలో నాల్గో స్థానంలో, జీఎస్‌డీపీలో 13వ స్థానానికి దిగజార్చిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం తిరోగమనం చెందుతున్నారు. ఎందరో త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ పాలనలో దేశంలో ఉన్నత స్థానంలో ఉంచారని, దిగజార్చవద్దని సూచించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి అయినా దిగజారుడు మాటలు మాట్లాడడం బంద్ చేసి ఇచ్చిన హామీలు నెరవేర్చేదిశగా పనిచేయాలని కోరారు. అందరం తెలంగాణ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణ లంకాసురుడు రేవంత్

- కాంగ్రెస్ అంటే ప్రతి ఇంట్లో సంక్షోభం.. ప్రతి కంట్లో విషాదం
- అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదా ?
- కర్షకులపై ఇంత అక్కసా రేవంత్ ?
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్‌రెడ్డి



కంఠేశ్వర్/ఖలీల్‌వాడి, జూన్ 2: తెలంగాణ దేవుడు, రాముడు కేసీఆరే అయితే తెలంగాణ లంకాసురుడు రేవంత్ అని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ నైజం జై తెలంగాణ అయితే.. రేవంత్ ఇజం నై తెలంగాణ అని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరై జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వినాయక్‌నగర్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ రూపం తెలంగాణ చిత్రపటమని అభివర్ణించారు. 32 పార్టీలను ఒప్పించి రాష్ట్రాన్ని సాధించిన యోధుడు కేసీఆర్ అని, ఆయనను మించిన తెలంగాణ ఉద్యమకారుడు మరొకరు లేరనిపేర్కొన్నారు. కేసీఆర్ అంటే ప్రతి ఇంట్లో సంక్షేమం, ప్రతి కంట్లో సంతోషమని, కాంగ్రెస్ అంటే ప్రతి ఇంట్లో సంక్షోభం, ప్రతి కంట్లో విషాదమని వ్యాఖ్యానించారు. అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ అన్నదాతలపై లేదా ? అని ప్రశ్నించారు. ఎక్కడ చూసినా రోడ్లపై ధాన్యం రాసులు, రైతన్న గోసలు కనిపిస్తుంటే సీఎం అందాల పోటీల్లో మునిగిపోయారన్నారు. అన్నదాతలపై ఇంత అక్కసా రేవంత్ అని మండిపడ్డారు. కష్టపడి రాష్ట్రాన్ని సాధిస్తే, తెలంగాణ పదాన్ని ఉచ్చరించని వ్యక్తి సీఎంగా వచ్చి రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా మార్చారన్నారు. రోడ్లపై ఉన్న వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, మాజీ నగర మేయర్ నీతూకిరణ్, నాయకులు బాజిరెడ్డి జగన్, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

వినాయక్‌నగర్‌లోని అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి వేముల, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి తదితరులు

# ఆవిర్భావ సంబురం

ఉమ్మడి జిల్లాలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- కలెక్టరేట్, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండావిష్కరణ
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు
- అమరవీరుల స్తూపం వద్ద నివాళులు



**తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ** దినోత్సవ వేడుకలు ఉమ్మడి జిల్లాలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ తల్లి విగ్రహాలు, అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. జిల్లాకేంద్రాల్లో నిర్వహించిన వేడుకల్లో ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



కామారెడ్డి జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



బిచ్కుందలో జెండాను ఆవిష్కరిస్తున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే



పార్టీ జిల్లా కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న మాజీ మంత్రి వేముల, మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో జెండా వందనం చేస్తున్న అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా

# వానకాలం సాగుకు వేళాయె..

రైతు భరోసా రాకపాయె..

- పంటలు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు
- పెట్టుబడి సాయం కోసం ఎదురుచూపులు
- ఇంకా అందని బోనస్ డబ్బులు



దుబ్బాక గ్రామపరిధిలో రైతులు వానాకాలం సీజన్ కోసం సిద్ధం చేసుకున్న నారుమళ్లు

ధర్పల్లి, జూన్ 2: రుతుపవనాలు ముందుగానే పలుకరించడంతో అన్నదాత వానకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నాడు. భూములు దమ్ము చేసి వరి వేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. నారు మడులను ముందుగానే వేసుకున్న రైతులు.. నాటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. మరోవైపు రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండాల్సిన ప్రభుత్వం మాత్రం తమకేమీ పట్టనట్లుగా వ్యహరిస్తున్నది. పంటలు వేసే కాలం వచ్చినా.. ఇప్పటి వరకు రైతు భరోసాపై ఇంకా ఎలాంటి స్పష్టత లేదు. సన్న వడ్లకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పిన సర్కారు.. ధాన్యం కాంటా చేసి నెల రోజులు గడుస్తున్నా, ఇప్పటి వరకు డబ్బులు మంజూరు చేయలేదు. ఈ తరుణంలో పంటలు సాగుచేసేది ఎలా అని రైతులు వాపోతున్నారు. మిరుగు కంటే మునుపే వర్షాలు పలుకరించడంతో రైతులు ఓవైపు సంతోష పడుతున్నా.. చేతిలో డబ్బులు లేక పంట సాగు చేసేదెలా అని దిగులు చెందుతున్నారు. డబ్బుల కోసం మళ్లీ ఇతరుల వద్ద బాకీ తేవాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆవేదనకు లోనవుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రైతు భరోసా ఇవ్వాలని, బోనస్ డబ్బులు మంజూరు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హ యాంలో పంటలు సాగుచేయడానికి ముందే డబ్బులు రైతుల ఖాతాలో జమ చేసేవారు. సీజన్‌కు ముందే చేతిలో డబ్బులు ఉండడంతో ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. వానలు పడకముందే విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచుకునే వారు. సాగు కష్టాలు లేకుండా కేసీఆర్ అండగా నిలిచేవాడని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

### భరోసా, బోనస్ డబ్బులు అందించాలి..



రైతుభరోసాతోపాటు సన్నవడ్లకు బోనస్ డబ్బులు ఇంతవరకు అందలేదు. వానకాలంలో పంట వేయడం ఇబ్బందిగా మారింది. నాకైతే ఇంతవరకు రుణమాఫీ కూడా కాలేదు. రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని చెబుతున్న ప్రభుత్వం.. కేవలం ఆర్భాటాలు తప్ప చేసిందేమీ లేదు. ఇప్పటికైనా రైతుభరోసా, బోనస్ డబ్బులు త్వరగా ఇచ్చి రైతులను ఆదుకోవాలి.

- కోతి శేఖర్‌రెడ్డి, రైతు, దుబ్బాక

### రైతులకు అండగా నిలవడం లేదు..



జీలుగ విత్తనాల ధరను ప్రభుత్వం ఒకేసారి బస్తాకు రూ.2,137కు పెంచి విక్రయిస్తున్నారు. రైతులను ఆదుకోవాల్సిపోయి అదనంగా డబ్బులు దండుకుంటున్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్నారే తప్ప వారికి అండగా నిలువడం లేదు. ప్రభుత్వం వెంటనే బోనస్ డబ్బులు, రైతుభరోసాను అందించి.. వానాకాలం పంటలు సజావుగా సాగుచేసుకునేలా చూడాలి.

- విజయేందర్, రైతు, దుబ్బాక

# నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో విషాదం


- ముగ్గురు యువకుల గల్లంతు
- గజఈతగాళ్ల సాయంతో గాలిస్తున్న పోలీసులు



హర్షవర్ధన్



నవీన్



మధుకర్‌గౌడ్

ఎల్లారెడ్డి రూరల్/ బాన్సువాడ/ నిజాంసాగర్, జూన్ 2: అప్పటి వరకు స్నేహితులతో సరదగా క్రికెట్ ఆడిన ముగ్గురు యువకులు నిజాంసాగర్ బ్యాక్‌వాటర్‌లో గల్లంతయ్యారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకున్నది. మండలంలోని సోమార్‌పేట గ్రామానికి చెందిన హర్షవర్ధన్ (16), తిమ్మారెడ్డి గ్రామానికి చెందిన నవీన్ (17), ఎల్లారెడ్డి పట్టణానికి చెందిన మధుకర్‌గౌడ్ (17) నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో గల్లంతయ్యారు. రాత్రి 9 గంటలైనా వారి ఆచూకీ లభించకపోవడంతో గజఈతగాళ్ల సాయంతో గాలిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సోమార్‌పేట గ్రామంలో 11 మంది యువకులు క్రికెట్ ఆడారు. సాయంత్రం అందరూ కలిసి సోమార్‌పేట-నిజాంసాగర్ మండలం హసన్‌పల్లి గ్రామంలో మధ్య ఉన్న నిజాంసాగర్ బ్యాక్‌వాటర్ వద్దకు వెళ్లారు. స్నానం చేసేందుకు అందరూ నీళ్లలోకి దిగగా, ఈత వచ్చిన కొంతమంది ఈదుకుంటూ ముందుకు వెళ్లారు. కొద్దిలోతు వరకు వెళ్లిన హర్షవర్ధన్, నవీన్, మధుకర్ గౌడ్ బ్యాక్ వాటర్‌లో ఉన్న బురదలో చిక్కుకున్నారు. బయటికి రావడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తూ హాహాకారాలు చేశారు. ఒడ్డుకు దగ్గరలో స్నానం చేస్తున్న మిగతా ఎనిమిదికి పెద్దగా ఈత రాదు. దీంతో వారు కూడా అరుస్తుండగానే ముగ్గురు యువకులు నీట మునిగి గల్లంతయ్యారు. వెంటనే మిగతా యువకులు గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు చెప్పడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎల్లారెడ్డి, నిజాంసాగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సాయంత్రం 7.30 గంటల ప్రాంతంలో గజఈతగాళ్ల సాయంతో గల్లంతైన యువకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో పరిస్థితులు అనుకూలంగా లేవని పోలీసులు పేర్కొన్నారు. యువకుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు స్థానిక పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న యువకుల కుటుంబీకులు, గ్రామస్తులు నిజాంసాగర్ బ్యాక్ వాటర్ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకున్నారు. గల్లంతైన యువకుల కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

# ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

మోర్తాడ్, జూన్ 2: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి సోమవారం 672 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5టీఎంసీలు)కాగా ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 1062.20 అడుగుల (12.788 టీఎంసీలు)నీటి నిల్వ ఉన్నది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువకు 100 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, 341క్యూసెక్కుల నీరు ఆవిరిరూపంలో వెళ్తున్నది.

# నేటి నుంచి పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

కామారెడ్డి, జూన్ 2 : ఉమ్మడి జిల్లాలో నేటి నుంచి ఈ నెల 13వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. కామారెడ్డి జిల్లాలో మూడు పరీక్షాకేంద్రాలను (బాన్సువాడలో -2, కామారెడ్డిలో -1) ఏర్పాటు చేసినట్లు డీఈవో రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు మొత్తం 695 మంది విద్యార్థులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రం పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని పేర్కొన్నారు. పాఠశాల నుంచి హాల్‌టికెట్లు పొందలేని విద్యార్థులు www.bse.telangana.gov.in అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే కంట్రోల్ రూం నంబర్ 9032695219 లో సంప్రదించాలని సూచించారు.

